క్లుప్తంగా

పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తాం



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఆయన మాట్లాడారు. 10 మంది సిబ్బంది వారి సమస్యలపై వినతులు ఇచ్చారన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట మద్దు, గౌస్, వెంకటలింగం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 29 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉండగా అందులో 14మందికి మాత్రమే జీతాలు పెరగడంతో అంతర్యం ఏమిటని అన్నారు. కార్మికులకు జీతం పెంచే విషయంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఏపీఎంటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పుల్లయ్యనాయక్, కార్యదర్శి మహేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ టీచర్లకు మూడేళ్ల నుంచి పదోన్నతులు చేపట్టలేదని, 5 సంవత్సరాల నుంచి బదిలీలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులపై సవతి తల్లి ప్రేమ చూపుతుందని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు నాగవెంకటేశ్వర్లు, నాగేశ్వర నాయుడు, జమీల్ అహమ్మద్, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ముత్యాలపాడు రహదారిలో ఆటో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ

చాగలమర్రి: వాహన డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని చాగలమర్రి ఎస్ఐ రమేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన చాగలమర్రిలోని ముత్యాలపాడు రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న కార్లు, ఆటోలను ఆపి జరిమానాలు విధించారు. రికార్డులను పరిశీలించారు. డ్రైవర్లకు ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నీటి విడుదల

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో ఎత్తిపోతల పథకం నుంచి ఎమ్మెల్యే జయసూర్య శుక్రవారం నీటిని విడుదల చేశారు. మూడు మోటార్ల ద్వారా 31 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్కాల ఎత్తిపోతల పథకం పరిధిలో 2,000 ఎకరాలకు సమృద్ధిగా నీరందించడమే లక్ష్యమన్నారు. ప్రతి రైతు మంచి పంటలు పండించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు.

పెళ్లిలో రక్తదాన శిబిరం



మండపంలో రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మహానంది దేవస్థానంలో శుక్రవారం తమ్మడపల్లె గ్రామానికి చెందిన మహేష్, హేమలతల పెళ్లి వైభవంగా నిర్వహించారు. వరుడు మహేష్ వినూత్న ఆలోచనతో పెళ్లి మండపం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించి 20 మందితో రక్తదానం చేయించారు. రక్తదానంపై ప్రజల్లో చైతన్యవంతం చేసేందుకే రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు వరుడు మహేష్ తెలిపారు. సేకరించిన రక్తాన్ని నంద్యాల బ్లడ్ బ్యాంక్‌కు అందజేసినట్లు తెలిపారు.

రక్షణ కల్పించాలి



వృత్తిరీత్యా ఎంతో మంది మహిళా డాక్టర్లు ఒంటరిగానే విధులకు వస్తుంటారు. పని ప్రదేశంలో వారికి తప్పని సరిగా రక్షణ అవసరం. ఒక డాక్టర్ తయారు చేసేందుకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుంది. వేలమందికి ప్రాణాలు పోయాల్సిన వైద్యురాలు అత్యాచారాలకు, దాడులకు గురై ప్రాణాలు కోల్పోవడం మంచిదికాదు. కోల్‌కతాలో యువ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడాన్ని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి. –డాక్టర్ భార్గవి, దబ్బ్యాకొత్తపల్లె, పీహెచ్‌సీ

రాత్రివేళల్లో విధులు ఛాలెంజే



ప్రస్తుతం వైద్యులపై దాడులు, మహిళా డాక్టర్లపై అత్యాచారాలు పెరగడం ఆందోళనకరం. రాత్రివేళల్లో వైద్యులు విధులు నిర్వహించడం ఛాలెంజింగ్‌గా మారింది. ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లతో పాటు నర్సులు, జీఎన్ఎంలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు విధులు నిర్వహిస్తుంటారు. వారికి తప్పని సరిగా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. ఎందుకంటే భయంతో వైద్యం చేయాలంటే ప్రాణాలతో చెలగాటం ఆడినట్లే. ఓ డాక్టర్ ఉంటే ఎంతో మంది ప్రాణాలు కాపాడుతాడానే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి –డాక్టర్ నాగేంద్ర, దొర్నిపాడు, పీహెచ్‌సీ

ఆదర్శనీయులు ఆంధ్రకేసరి

- టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో వక్తలు



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: పేద కుటుంబంలో జన్మించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని వక్తలు కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకుని పలువురు టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఎస్పీ కార్యాలయ ఆవరణలో జరిగిన ఆంధ్రకేసరి జయంతి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా పాల్గొని మాట్లాడారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తెల్లదొరల తుపాకులకు గుండె చూపిన వీరుడు ఆంధ్రకేసరి అని కొనియాడారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ తర్వాత తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు పనిచేశారన్నారు. ఆయన స్వాతంత్ర్య సమరయోధునిగా, రచయితగా, సంపాదకీయుడుగా పనిచేశారన్నారు. చదువు కోసం వారాల అబ్బాయిగా పనిచేసిన ప్రకాశం పంతులు యువతరానికి స్ఫూర్తిదాయకులు అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఏఏఓ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో మునిసిపల్ ఉద్యోగులు, ఆంధ్రకేసరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ విష్ణుచరణ్, డీఆర్‌ఓ పద్మజ

భావితరాలకు స్ఫూర్తి

నంద్యాల(సిటీ): ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు భావితరాలకు స్ఫూర్తి అని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వాసం, చిత్తశుద్ధి, ధైర్యం టంగుటూరి సొంతమన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో పోరాటాలు చేసిన తొలి తరం నాయకుడన్నారు. ఆయన చూపిన తెగువ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ రమణ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

నంద్యాల(అర్బన్): కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ముస్తాక్ అహమ్మద్ పాల్గొన్నారు. అంతకు ముందు జేసీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీ ఎదురుగా గుండె నుంచి ఆంధ్ర కేసరిగా పేరు పొందారన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ కాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించి గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. తర్వాత భక్తులకు దర్శన భాగ్య కల్పించారు. పలువురు అమ్మవారికి ఒడి బియ్యం పోసి పుష్పాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు చేసి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాశీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి, తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో సిబ్బంది వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. మండల కేంద్రంలో సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి కంటైనర్ సర్వే చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సరస్వతీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గ్రామ సభలు

నంద్యాల(అర్బన్): మనపంచాయతీ.. మన సాధికారతపై శుక్రవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో నిర్వహించిన గ్రామసభలు తూతూ మంత్రంగా సాగాయి. పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు పాల్గొని హడావుడి చేశారు. దీంతో ప్రజల నుంచి ఈ సభలకు ఆశించిన స్పందన లభించలేదు. కొన్ని గ్రామాల్లో ప్రజలు అధికారుల ముందు తమ సమస్యలను ఏకరువు పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. చాబోలులో జరిగిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎంపీడీఓ సుగుణశ్రీ, పోలూరులో జరిగిన సభలో డీఈఓ సుధాకర్‌రెడ్డి, రాయమాల్పురంలో జరిగిన సభలో ఎంపీపీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలో గ్రామసభలు సాదాసీదాగా జరిగాయి. గోస్పాడులో గ్రామ సభ అనంతరం స్పెషలాఫీసర్ ప్రతాపరెడ్డి, తహసీల్దార్ షేక్ మొహిద్దీన్, ఎంపీడీఓ నాగఅనసూయ మోడల్ స్కూలును పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు.

సమస్యలు ఏకరువు

శిరివెళ్ల: మండలంలో జరిగిన గ్రామ సభల్లో ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. సర్పంచు సాలమ్మ అధ్యక్షతన స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో జరిగిన సభలో డ్రైనేజీ కాల్వలు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను నిర్మించాలని అంగన్‌వాడీ వర్కర్లు ఉపాధి పథకం పీడీ రామచంద్రారెడ్డికి అర్జీ సమర్పించారు.



శిరివెళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు చేయాలని పీడీకి అర్జీ ఇస్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

దొర్నిపాడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవచ్చని గ్రామ సభల జిల్లా ప్రత్యేకాధికారి (పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్) గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, డబ్ల్యూ గోవిందిన్నె తదితర గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలను పరిశీలించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీకార్యదర్శులు, సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు అధ్యక్షతన జరిగిన సభలో ఉమ్మడి జిల్లా మైనారిటీ శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి సునీల్ ఖన్న హాజరై మాట్లాడారు.

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. 24-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులు,పనిదినాలు, పంచాయతీ పరంగా చేయాల్సిన పనులపై తీర్మానాలు చేసి చేతులు దులుపుకున్నారు. మండ కేంద్రం రుద్రవరం,కొండమాయపల్లె ఆర్.నాగులవరం గ్రామ సభల్లో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నాగరాజు పాల్గొని మాట్లాడారు.



ఉయ్యాలవాడలో ప్రత్యేకాధికారికి సమస్యలపై వినతి అందజేస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలకేంద్రం చాగలమర్రిలోని స్థానిక 3 సచివాలయం ఆవరణలో సర్పంచ్ పెద్దన్న గారి తోలసమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఎంపీపీ వీరభద్రుడు, ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ పాల్గొని మాట్లాడారు. ప్రజలు గోడు చెప్పుకునేందుకు అవకాశమివ్వనప్పుడు సభలు ఎందుకు నిర్వహించాలని రిటైర్డు ప్రిన్సిపాల్ పోలిశెట్టి అధికారులను నిలదీశారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ మృతికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, భాస్కర్, రామకృష్ణుడు, శమీమ్‌భాను, అరవిందకుమార్, కాశీం, రమణ, జాన్సన్, గోపాల్, శేఖర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా నాయకురాలు

నిందితులను కఠినంగా శిక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): మహిళలపై అత్యాచారం చేస్తున్న నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, రజిత డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయాలన్నారు. జాతీయ స్థాయిలో వైద్య విద్యార్థులకు భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు సుశీలమ్మ, మున్ని, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

దొర్నిపాడు: నిబంధనలకు అతిక్రమించి హెల్త్‌క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు నాగేంద్ర, రుహుల్లాఖాన్ హెచ్చరించారు. డీఎం అండ్ హెచ్‌ఓ ఆదేశాల మేరకు దొర్నిపాడులోని హితేశ్ హోమియోపతి క్లినిక్‌ను వారు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ హోమియోపతి వైద్యం అంటూ అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు గమనించామన్నారు. అక్కడ హైపవర్ యాంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడుతున్నారన్నారు. అలాగే రెండు ఆక్సిజన్ సిలిండర్లు కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. హోమియో వైద్యం పేరుతో అల్లోపతి మందులు వాడటం సరికాదని చెప్పారు. వీరి వెంట సీహెచ్‌ఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



హోమియోపతి క్లినిక్‌లో మందులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

ఉచిత ఎంసెట్ కోచింగ్ ప్రారంభం

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత ఎంసెట్ కోచింగ్‌ను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శ్రీశైలం మండలంలోని విద్యార్థులు ఎంసెట్ కోచింగ్ తీసుకోవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలాంటి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కళాశాలలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి, విద్యాసంస్థల నిర్వాహకుడు మగ్బుల్‌హుస్సేన్, అధ్యాపకులు సూర్యనారాయణ, బాలఎల్లయ్య, డాక్టర్ అబూబకర్, రామచంద్రయ్య పాల్గొన్నారు.



కోచింగ్ వివరాలు తెలుపుతున్న అధ్యాపకులు

జీఆర్‌సీ మానిటరింగ్ బాడీ ఏర్పాటు

నంద్యాల(అర్బన్): జిల్లాకు సంబంధించి గ్రీవెన్స్ రెడ్ రెస్సల్ సెల్ (జీఆర్‌సీ) మానిటరింగ్ బాడీ ఏర్పాటు చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా స్థాయి శాఖల పర్యవేక్షణ, డివిజనల్ లెవెల్ టీంతో కో ఆర్డినేషన్, మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్షల నిర్వహణ లక్ష్యంగా మానిటరింగ్ బాడీ ఏర్పాటైంది. రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్‌ల నిర్వహణ కేఆర్‌సీసీ తహసీల్దార్ అంజనాదేవికి, రెవెన్యూ ల్యాండ్ రికార్డ్స్ సీనియర్ అసిస్టెంట్ రమణకు, సర్వే అండ్ సెటిల్‌మెంట్స్ విలేజ్ సర్వేయర్ షేక్ ఫిరోజ్‌బాషాకు, పోలీసుకు సంబంధించి ఎస్ఐ కుమారికి, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఆల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్స్ డాటా అనలిస్ట్ జీవన్‌కు, ఆల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్స్ వార్డు సెక్రటరీ అమూల్య ముత్యంకు, ఎడ్యుకేషనల్, మెడికల్ అండ్ హెల్త్, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ నాగేశ్వర రెడ్డికి, అగ్రి, ఇండస్ట్రీస్, న్యాచురల్ రీసోర్స్ డిపార్టుమెంట్ వార్డు అడ్మిన్‌స్ట్రేటివ్ సెక్రటరీ వెంకట సుధాకర్‌కు కేటాయించినట్లు సమాచారం.

కౌలు రైతు మృతి



శ్రీనివాసులు(ఫైల్)

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడుకు చెందిన కౌలు రైతు శ్రీనివాసులు(49) శుక్రవారం పొలం పనులు చేస్తుండగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పదేళ్లుగా ఆయన 10 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అయితే, గత మూడేళ్ల నుంచి పంటలు సరిగా పండకపోవడంతో అప్పుల్లో మునిగిపోయాడు. సుమారు రూ.15 లక్షలకు పైగా ఉన్న అప్పులను ఎలా తీర్చాలని ఆందోళన చెందేవాడు. ఈ క్రమంలో శుక్రవారం వరిపంటకు నీరు కట్టేందుకు వెళ్లగా ఛాతీలో నొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. ఈమేరకు భార్య మహేశ్వరి ఫిర్యాదుతో ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు

బేతంచెర్ల: ఖరీఫ్ పంటల సాగులో తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలరాజు, ఆదినారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో వివిధ పంటలను పరిశీలించారు. ముఖ్యంగా వేరుశనగ పంటలో వర్షాలకు కాండం కుళ్లు, వేరుకుళ్లు వచ్చే అవకాశం ఉందని.. నివారణకు హెక్సనాజోల్‌ను లీటర్ నీటికి 2ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సజ్జ పంటలో కంకులకు శనగ పచ్చ పురుగు ఆశించి గింజలను తినడం జరుగుతుందని, నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును 0.5 గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మిరప పంటలో ఆకులు ఎర్రగా మారుతున్నాయని, వీటి నివారణకు ఎకరాకు కేజీ 19-19-19 మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏఓ కిరణ్ కుమార్, ఏఈఓ మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.



హెచ్ కొట్టాలలో మిరప రైతుకు సలహాలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఇసుక వాహనాలు సీజ్

ఆళ్లగడ్డ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న 7 వాహనాలను సీజ్ చేసినట్లు ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు. జమ్ములమడుగు వైపు నుంచి ఆళ్లగడ్డ పట్టణంలోకి ఇసుక వాహనాలు వస్తున్నాయనే సమాచారంతో శుక్రవారం పట్టణ శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 5 టిప్పర్లు, 2 ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన బోయ నాగిశెట్టి

డోన్ రూరల్: పెట్రోల్ బంక్ బంద్ చేసినందు వల్ల పెట్రోల్ పోయడం సాధ్యం కాదని చెప్పిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై అధికార పార్టీ శ్రేణులు దాడికి పాల్పడిన సంఘటన వెంకటాపురం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్‌లో వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ నాగిశెట్టి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో కృష్ణగిరి మండలం లాల్‌మాన్‌పల్లె గ్రామానికి చెందిన కొందరు టీడీపీ శ్రేణులు నాగిశెట్టిని నిద్రలేపి బైక్‌కు పెట్రోల్ పోయమని అడిగారు. అయితే అందుకు ఆయన తిరస్కరించడంతో ఆగ్రహించి ఏకంగా నాగిశెట్టిపై దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడి తలకు తీవ్ర గాయమైంది. దాడి విషయం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది ఇలా ఉండగా లక్కసాగరానికి చెందిన టీడీపీ నాయకులు ఒకరు కేసు నమోదు కాకుండా అడ్డుపడుతున్నట్లు బాధిత బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసుల వివరణ కోరగా ఘర్షణ పడిన ఇరు వర్గాల వారిని విచారిస్తున్నామని నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇక్కడ ముక్కు మూసుకోవాల్సిందే

- అధ్వానంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం
- శిథిలమైన సెప్టిక్ ట్యాంక్.. కంపుకొడుతున్న బాత్‌రూంలు

ఉయ్యాలవాడ: ఊరూరా తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే వ్యాధులు దరి చేరుతాయని చెప్పే అధికారులే తమ కార్యాలయాల వద్ద పరిశుభ్రతను గాలికొదిలేశారు. ఉయ్యాలవాడ ఎంపీడీఓ కార్యాలయమే ఇందుకు ఉదాహరణ. ఈ కార్యాలయ ఆవరణ అధ్వానంగా ఉంది. అత్యవసరాల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు (సెప్టిక్ ట్యాంకు) పూర్తిగా దెబ్బతిని కంపుకొడుతున్నాయి. బాత్‌రూంలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఈ కార్యాలయ సిబ్బందితో పాటు వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెప్టిక్ ట్యాంకు పై కప్పు దెబ్బతినడంతో భరించలేని దుర్వాసన వస్తుంది. కార్యాలయంలోకి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కో సారి కార్యాలయంలో సమావేశాలు గంటల తరబడి జరుగుతుంటాయి. ఈ సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చే ప్రజా ప్రతినిధులు, ముఖ్యంగా మహిళల ఇబ్బంది అంతా ఇంతా కాదు. అత్యవసర సమయంలో వారు బాత్‌రూంలోకి వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దెబ్బతిన్న సెప్టిక్ ట్యాంకు పై కప్పు



అధ్వానంగా బాత్‌రూం



డోర్ కూడా సరిగా లేని మహిళల మరుగుదొడ్డి